కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో... టమాట 25, పచ్చిమిర్చి 40 , బెండ 60, కాకర 60, దొండ 60, దోస 30, ఆలు 25, చామ 60, కీర 30, బీర 70, వంకాయ 60, గోకర 60, బీన్స్ 60, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 20, క్యారెట్ 60, చిక్కుడు 70, ఉల్లి 60 (1 కేజీ), ములక్కాయలు (1) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 250, వెల్లుల్లి 300.

6,7 తేదీలలో జాతర

పటాన్‌చెరు టౌన్: జనవరిలో జరగనున్న మల్లన్న స్వామి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయడం జరుగుతుందని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు.గురువారం పట్టణంలోని పారిశ్రామికవాడలోని మల్లన్న దేవస్థానం వద్ద ఆలయ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఉత్సవ నిర్వహణపై వేద పండితులు, పెద్దలలో చర్చించిన అనంతరం జనవరి 6,7వ తేదీలలో జాతర నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, కృష్ణ యాదవ్, మల్లేష్ యాదవ్, గోపాల్, ఆలయ పండితులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు

మియాపూర్ : మియాపూర్ దీప్తిశ్రీనగర్‌లోని ధర్మపురి క్షేత్రంలో శాంభవి విజయ దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాలను రెండోరోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అమ్మవారిని 108 కలశాల గంగా జలంతో అభిషేకం చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


ఖాజాగూడలోని భగీరథమ్మ చెరువు ఎఫ్‌టీఎల్‌లో మట్టి పోసిన దృశ్యం


ఖాజాగూడలోని భగీరథమ్మ చెరువును బండ రాళ్లతో పూడ్చిన దృశ్యం

రాత్రికి రాత్రే చెరువును పూడ్చారు

- పట్టించుకోని అధికారులు
- భగీరథమ్మ చెరువులో ఆక్రమణల పర్వం

గచ్చిబౌలి: నానక్‌రాంగూడ రోటరీ సమీపంలో ఖాజాగూడ ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న భగీరథమ్మ చెరువును రాత్రికి రాత్రికే కొందరు పూడ్చేశారు. అధికార యంత్రాంగం ఎన్నికల విధుల్లో ఉండగా ఇదే అదనుగా భావించి కొందరు వ్యక్తులు ఖాజాగూడ గ్రామం వెనక భాగంలో దాదాపు ఎకరం స్థలంలో మట్టి పోశారు. సీవరేజ్ ప్లాంట్‌కు వెళ్లే దారిలో ఎడమ వైపు ఎఫ్‌టీఎల్ ఫెన్సింగ్ తొలగించి మరీ బండరాళ్లు డంప్ చేశారు. తమకు పట్టా భూములున్నాయని చెబుతూ కొందరు ఈ పని చేస్తున్నారు. ఆ ఏరియాలోనే అక్రమంగా నీటి వ్యాపారం చేయడంతో పాటు ఓ ప్రహరీ వెలవడం గమనార్హం. సీవరేజ్ ప్లాంట్ పేరుతో ఓ నిర్మాణ సంస్థ రోడ్డు వేసి మరీ వాడుకోవడం విమర్శలకు దారితీస్తోంది. భగీరథమ్మ చెరువు ఇప్పటికే ఆక్రమణకు గురైందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అది చాలదన్నట్టుగా చెరువును పూడ్చివేయడం ఆందోళన కలిగిస్తోంది. ఐదు నెలల క్రితం గౌలిదొడ్డిలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఈద్గవాని కుంటను కొందరు పూడ్చివేశారు. తమకు పట్టా భూమి ఉందని బుకాయించినా అధికారులు పూడ్చివేతకు పాల్పడిన వారికి కోటి 84 లక్షల రూపాయలు జరిమానా విధించారు. ఆ డబ్బుతోనే పూడ్చివేసిన మట్టిని తొలగిస్తామని అధికారులు చెప్పారు. కానీ ఇప్పటి వరకు గంపెడు మట్టి కూడా తీయలేదు.


ఎఫ్‌టీఎల్ ఫెన్సింగ్ లోపల వేసిన బండరాళ్లు

ఎఫ్‌టీఎల్ ఎక్కడ?

వాస్తవానికి 54 ఎకరాల్లో భగీరథమ్మ చెరువు విస్తరించి ఉంది. ఖాజాగూడ, నానక్‌రాంగూడ సర్వే నంబర్లలోనే ఎక్కువ భాగం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ఉంది. పట్టాలు కలిగిన కొందరు ఫెన్సింగ్ తొలగించడం, బండరాళ్లు, మట్టితో పూడ్చివేయడం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ఎఫ్‌టీఎల్ సరిహద్దులు నిర్ణయించి, ఫెన్సింగ్ ఏర్పాటు చేశామని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నా పూర్తి స్థాయిలో ఫెన్సింగ్ కనిపించడం లేదు.

అలంకార ప్రాయంగా వాచ్ టవర్

జీహెచ్ఎంసీ పరిధిలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో ఆక్రమణలు, కబ్జాలను అరికట్టేందుకు వాచ్ టవర్లు ఏర్పాటు చేశారు. 2020లో శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ పరిధిలో జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ ఆధ్వర్యంలో 12 చెరువులలో వాచ్ టవర్లు నెలకొల్పారు. మూడంతస్తుల ఎత్తులో ఉండే వాచ్‌టవర్లపై విధులు నిర్వర్తించేందుకు లేక్ ప్రొటెక్షన్ గార్డులను నియమించారు. అయితే వారు కొద్దికాలం మాత్రమే కాపలాగా ఉన్నారు.

ఫిర్యాదు చేశాం

భగీరథమ్మ చెరువులో ఎఫ్‌టీఎల్ లోపల బండ రాళ్లు వేసిన వారిపై రాయదుర్గం పీఎస్‌లో ఫిర్యాదు చేశామని ఇరిగేషన్ ఏఈఈ విశ్వం తెలిపారు. ఖాజాగూడ వెనక భాగంలో మట్టి పూడ్చినట్లు తన దృష్టికి రాలేదన్నారు. అక్రమణను పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

- కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్


రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మెట్టుకుమార్

పటాన్‌చెరుటౌన్: సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని గౌతంనగర్ కాలనీలో జీహెచ్ఎంసీ నిధులు రూ.50 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను గురువారం పరిశీలించారు. అనంతరం అంబేద్కర్ కాలనీలో పర్యటించి డ్రైనేజీ ,నీటి సమస్యపై కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు.

ఎప్పటికప్పుడు చెత్తను తరలించాలి

- ఉపకమిషనర్ వంశీకృష్ణ



పారిశుధ్య విభాగం అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఉపకమిషనర్ వంశీకృష్ణ

హఫీజ్‌పేట్ : చందానగర్ సర్కిల్– 21 పరిధిలో శానిటేషన్ విభాగం సిబ్బంది పనితీరుపై ఏఎంహెచ్‌ఓ డాక్టర్ కార్తీక్, సిబ్బందితో గురువారం ఉపకమిషనర్ వంశీకృష్ణ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని ప్రధానరోడ్లపై చెత్త తొలగింపు, పిన్ పాయింట్‌ల వద్ద సిబ్బంది పర్యవేక్షణను ఎస్ఎఫ్ఐ, ఎస్ఆర్‌పిలు గమనించాలన్నారు. ఎప్పటికప్పుడు రోడ్లపై చెత్తను తరలించాలన్నారు. సమావేశంలో శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఏఎంహెచ్‌ఓ, ఎస్ఆర్‌పీ, ఎస్ఎఫ్ఏలు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర రుద్ర సహిత చండీయాగం



హఫీజ్‌పేట్ : చందానగర్ శిల్పా ఎన్‌క్లేవ్‌లోని విశాఖ శ్రీ శారదా పీఠ పాలిత లక్ష్మీ గణపతి దేవాలయంలో శ్రీ సహస్ర రుద్ర సహిత సహస్ర చండీయాగం గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు సప్తాహ్నిక దీక్షతో ఏడు రోజుల పాటు శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రధాన అర్చకులు సుదర్శనం సత్యసాయి పర్యవేక్షణలో బ్రహ్మశ్రీ వేదులు పవన్‌కుమార్ శర్మ, మురళీధరశర్మ ఆధ్వర్యంలో చండీ ఉపాసకులతో ఋత్విక్కులతో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉదయం 9 గంటలకు శ్రీ విఘ్నేశ్వర పూజ పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన దీక్షాధారణ గోపూజ, అఖండ దీపారాధన వాస్తుపూజ, వాస్తు హోమం, యాగశాల ప్రదక్షణ తదితరాలను నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు చండీయాగ సంకల్పము, హోమం, బలిహరణ, రాత్రి 8 గంటలకు నీరాజనం మంత్ర పుష్పం, తీర్థప్రసాద వితరణ చేశారు.

వర్షపునీరు నిలవకుండా చూడాలి


మహంకాళినగర్‌లో రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని మహంకాళినగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డును లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిల్వకుండా ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదే విధంగా కాలనీ రెండు వీధుల్లో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లను త్వరలో పూర్తి చేస్తామని కాలనీ ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, నిరంజన్ యాదవ్, ధాతి రమేష్, షౌకత్‌అలీ మున్నా, మల్లేష్, పోశెట్టి గౌడ్, ఫారూఖ్, ఖలీమ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు, ప్రభుత్వ స్థలాలను రక్షించండి


కబ్జాకు గురైన రేగులకుంట చెరువు

మియాపూర్ : చెరువులు, ప్రభుత్వ స్థలాలను కాపాడాలని జనం కోసం అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి అధికారులను కోరారు. మియాపూర్ దీప్తిశ్రీనగర్ కాలనీలోని 161 సర్వేనంబర్‌లో గల రేగులకుంట చెరువు 1200 గజాల స్థలాన్ని కబ్జా చేశారని దీనిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులు, ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్నా అధికారులు పట్టించుకో లేదన్నారు. 161 సర్వేనంబర్ రేగులకుంట చెరువును ఆక్రమించి 1200 గజాల స్థలంలో బోరు వేసి నిర్మాణ పనులు చేపట్టినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. చెరువులను పరిశీలించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పేదలకు అండగా కాంగ్రెస్

రాయదుర్గం: పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని బసవతారకనగర్, కేశవనగర్‌బస్తీలలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బసవతారకనగర్‌బస్తీ ప్రజలకు పట్టాలు, కరెంట్ మీటర్లు, నల్లా కనెక్షన్లు వచ్చేలా చూస్తామన్నారు. కేశవనగర్‌బస్తీలో పట్టాలు రాని ప్రజలకు న్యాయం చేసేలా చూస్తామన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్, సత్యంగౌడ్, రమేష్, అనిల్, రాధాకృష్ణ, వెంకటేష్, మహేష్, శ్రీశైలం, నర్సింహ, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

ఎమ్మెల్యే గాంధీ


ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే గాంధీని సన్మానించిన గేటెడ్ కమ్యూనిటీవాసులు

రాయదుర్గం: ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా పనిచేస్తామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడ సాయివైభవ్ కాలనీలో కాలనీ అధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో కాలనీవాసులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం గాంధీ, శ్యామలాదేవి దంపతులను కాలనీవాసులు ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలుచోట్ల డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని, ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. సాయివైభవ్, సాయిఐశ్వర్య కాలనీలలో డ్రైనేజీ వ్యవస్థ, వరద నీటి సమస్య శాశ్వతప్రాతిపదికన తీర్చడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, కాలనీ కార్యదర్శి పద్మావతి, నాయకులు గణేష్‌ముదిరాజ్, నిహారిక, గ్రీన్ గ్రేస్, అపర్ణ వెస్ట్‌సైడ్, సాయిఐశ్వర్య కాలనీ, ఇతర గేటెడ్ కమ్యూనిటీ అసోసియేషన్ల ప్రతినిధులు, ఆయా కాలనీవాసులు పాల్గొన్నారు.

9వేల కోట్ల అభివృద్ధిపై వివరాలు ఇవ్వాలని వినతి

కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేసిన కాంగ్రెస్ శ్రేణులు


కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇస్తున్న ఐఎన్‌టీయూసీ, కాంగ్రెస్ నాయకులు

పటాన్‌చెరు టౌన్: బీఆర్ఎస్ హయాంలో 9 ఏళ్ల పాలనలో రూ.9 వేల కోట్లతో అభివృద్ధి చేశామని పటాన్‌చెరు ఎమ్మెల్యే బుధవారం సమావేశంలో మాట్లాడడం ఆశ్చర్యానికి గురి చేసిందని ఐఎన్‌టియూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో 9 ఏళ్లలో చేసి రూ.9వేల కోట్ల అభివృద్ధిపై వివరాలు ఇవ్వాలని గురువారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో సిబ్బందికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పట్టణంలో వందలాది మంది గృహాలు ఇంకా పెంకుటిల్లు అలాగే సిమెంట్ రేకుల ఇళ్లు ఉన్నాయని ఇన్ని వేల కోట్ల రూపాయల నిధులు వస్తే పటాన్‌చెరు నియోజకవర్గంలో ఇళ్లు లేని నిరుపేదలు ఎలా ఉంటారని ప్రశ్నించారు. తొమ్మిది సంవత్సరాల్లో 9 వేల కోట్లు ఎక్కడెక్కడ ఖర్చు చేశారో వివరాలు ఇవ్వాలని కోరామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు పాషా, కిషన్ ,జై ప్రకాష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జీజీబీఎస్‌తో సిమెంట్ వినియోగాన్ని తగ్గించవచ్చు

పటాన్‌చెరు: ఉక్కు పరిశ్రమలో ఉప ఉత్పత్తి అయిన గ్రౌండ్ గ్రాన్యులేటెడ్ బ్లాస్ట్ ఫర్నేస్ స్లాగ్ (జీజీబీఎస్)ను వినియోగించి సిమెంట్ వాడకాన్ని 25 నుంచి 70 శాతం వరకు తగ్గించవచ్చని జేఎస్‌డబ్ల్యూ ప్రైవేట్ లిమిటెడ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ షణ్ముఖరెడ్డి చెప్పారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'బలమైన, మన్నికైన, స్థిరమైన, పర్యావరణహిత కాంక్రీట్ కోసం స్లాగ్ బేస్డ్ ఉత్పత్తి.. వినియోగం' అనే అంశంపె గురువారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు.సిమెంట్ ఉత్పత్తి కాలుష్యానికి దారి తీస్తున్నందున, పర్యావరణ పరిరక్షణకు, నిర్మాణ అవసరాలను తీర్చడానికి ఫ్లయాష్, మెట్రో సిలికా, వరిపొట్టు, జీజీబీఎస్ వంటి ప్రత్యామ్నాయాల అన్వేషణ మొదలైందన్నారు. జీజీబీఎస్‌ను ఉపయోగించడం ద్వారా థర్మల్ క్రాస్లు, ప్రాజెక్టు ఖర్చు, వేడిని గణనీయంగా తగ్గించడమే గాక కాంక్రీటు నిర్మాణాల మన్నిక పెరిగి, దీర్ఘకాలం దృఢంగా ఉంటాయని షణ్ముఖరెడ్డి చెప్పారు. మట్టి స్థిరీకరణలో కూడా జీజీబీఎస్ క్రియాశీలపాత్ర పోషిస్తోందని, తద్వారా జాతీయ రహదారులు, సబ్‌వేల్లో దీని వినియోగం పెరిగిందన్నారు. అనంతరం గీతం ప్రాంగణంలో ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో సివిల్ ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్న బైక్..

ఇద్దరికీ తీవ్ర గాయాలు ..ఒకరు మృతి

పటాన్‌చెరు టౌన్: సర్వీస్ రోడ్‌లో కారును ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న లారీని బైక్ ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరు యువకులు గాయపడగా అందులో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శివకుమార్ కథనం ప్రకారం.. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అబ్దుల్ రెహమాన్ (19), ఖాసీం ఇద్దరు బతుకుదెరువు కోసం వచ్చి బొల్లారం పరిధిలోని గాంధీనగర్‌లో ఉంటూ ఫాల్ సీలింగ్ వర్క్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం అబ్దుల్ రెహమాన్(19), ఖాసీం ఇద్దరు కలిసి బైక్ పై బొల్లారం నుండి పనిపై శంకర్‌పల్లి వైపు బయలుదేరారు.ఈ క్రమంలో ముత్తంగి సర్వీస్ రోడ్ నుండి కర్దనూర్ వైపు వెళ్తుండగా కార్‌ను దాటే క్రమంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టారు. దీంతో బైక్ నడుపుతున్న అబ్దుల్ రెహమాన్, ఖాసీంకు తీవ్ర గాయాలు కావడంతో వీరిని చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అబ్దుల్ రెహమాన్ మధ్యాహ్నం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి, ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలి

శేరిలింగంపల్లి: నిర్మాణ పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అన్నారు. గురువారం తారానగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కాంక్రీట్ పనులు పూర్తి చేసిన తర్వాత వీలైనంత ఎక్కువసార్లు వాటరింగ్ చేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. నాయకులు రాజు యాదవ్, వీరేశంగౌడ్, రామ్‌చందర్, పాండు ముదిరాజ్, గోపాల్‌యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, శ్రీనివాస్, సురేష్‌స్వామి పాల్గొన్నారు.



దంత వైద్యంపై అంతర్జాతీయ సదస్సు


మెడికవర్ ఆసుపత్రిలో సదస్సును ప్రారంభించిన డా.శరత్‌రెడ్డి తదితరులు

మాదాపూర్: ఆక్సిజన్ థెరపీ అనేది డెంటిస్ట్రీలో ముఖ్యంగా ఇంప్లాంటాలజీలో ఒక విప్లవాత్మక విధానం అని మెడికవర్ హాస్పిటల్ క్లీనికల్ డైరెక్టర్ డాక్టర్ శరత్‌రెడ్డి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో గురువారం దంత వైద్యం, ఇంప్లాంటాలజీలో ఆక్సిజన్ థెరపీపై అంతర్జాతీయ వర్క్‌షాప్‌ను మెడికవర్ దంత వైద్య విభాగం నిర్వహించింది. ఈ సదస్సులో వివిధ ఆసుపత్రుల నుంచి 100 మందికి పైగా దంతవైద్య నిపుణులు పాల్గొన్నారు. యూకే నుంచి డాక్టర్ మినాస్ లెవెన్స్కి, డాక్టర్ జోహాన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శరత్‌రెడ్డి మాట్లాడుతూ యూకే, ఇతర దేశాల నిపుణులతో అంతర్జాతీయ అనుభవాలు, దంత వైద్యంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందడానికి హైదరాబాద్‌లోని దంత వైద్యులకు వర్క్‌షాప్ ఒక వేదికను అందించిందన్నారు. కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్ డెంటల్ సైన్సెస్ హెడ్ డాక్టర్ శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై దృష్టి సారించాలి


8వ బెటాలియన్‌లో మెగా హెల్త్ క్యాంప్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న కమాండెంట్ సన్నీ

కొండాపూర్ 8వ బెటాలియన్ కమాండెంట్ సన్నీ

గచ్చిబౌలి: పోలీసులు ఆరోగ్యంగా ఉంటేనే విధి నిర్వహణలో కీలకపాత్ర పోషించేందుకు అవకాశం ఉంటుందని కొండాపూర్ 8వ బెటాలియన్ కమాండెంట్ సి సన్నీ పేర్కొన్నారు. కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో ఏఐజీ ఆస్పత్రి ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్‌ను బెటాలియన్ యూనిట్ ఆస్పత్రిలో నిర్వహించారు. ఈ క్యాంప్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యాయామం, యోగా, నడకతో బాటు మంచి ఆహారపు అలవాట్లను పాటించాలన్నారు. హెల్త్ క్యాంప్‌లో బెటాలియన్ సిబ్బందికి కార్డియాలజీ ఆర్థోపెడిక్స్, న్యూరాలజీ, న్యూరో వెస్క్యులర్ తదితరాలపై ఉచిత పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో బెటాలియన్ యూనిట్ డాక్టర్ జ్యోతిబాపులే, బెటాలియన్ అధికారులు, సిబ్బంది, ఏఐజీ ఆస్పత్రి వైద్యబృందం పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


గోపన్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న జగదీశ్వర్‌గౌడ్

కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్

రాయదుర్గం: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళే బాధ్యత కార్యకర్తలు, నాయకులదేనని పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ, మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బూత్ కమిటీ సభ్యులతో ఆయన సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని కాలనీ,బస్తీ నుంచి మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త, నాయకుడు సైనికుడిలా పనిచేయాలన్నారు. త్వరలో పార్లమెంటు ఎన్నికలు వచ్చే అవకాశం ఉన్నందున ఇప్పటినుంచే కాంగ్రెస్ పార్టీ అన్ని చోట్లా మెజార్టీ సాధించడంపై ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలన్నారు. కార్యకర్తలు, నాయకులందరికీ అండగా ఉంటామని, అందరికీ నిరంతరం అందుబాటులో ఉంటూ పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పి సురేందర్, రాధాకృష్ణ, రాజు, వెంకటేష్ ,అనిల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

తులసీనగర్.. చీకటిమయం

వీధి లైట్లు వెలగక అంధకారం

ఆల్విన్‌కాలనీ: విద్యుత్ దీపాలు వెలగక అంధకారంలో మగ్గుతున్నామని తులసినగర్ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్‌కాలనీ తులసినగర్‌లో కొన్ని వారాలుగా విద్యుత్ దీపాలు వెలగక వీధుల్లో చీకటి అలుముకుందని వాపోయారు. అసలే దొంగల బెడదతో భయపడుతున్నామని మొరపెట్టుకుంటున్నారు. గతంలో ఈ కాలనీలో రాత్రి వేళ దొంగతనాలనికి పాల్పడిన సంఘటనలు కూడా ఉన్నాయని, ఇళ్ల ముందు బైక్‌లు పార్కింగ్ చేస్తే పెట్రోల్ ఎత్తుకెళుతున్న సంఘటనలు కూడా కెమెరాల్లో కనిపించాయని చెప్పారు. తులసినగర్ ప్రధాన రహదారితో పాటు పలు వీధుల్లో విద్యుత్ దీపాలు వెలగడం లేదని స్థానికులు తెలిపారు. వీధి దీపాలు లేక సీసీ కెమెరాలు కూడా కాలనీలో సంచరించే వారిని గుర్తించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి లైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.


అంధకారంలో తులసీనగర్

